సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ శొంఠ్యాం ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా శొంఠ్యాం, దిబ్బడిపాలెం, గుమ్మడివానిపాలెం, దిబ్బమీదపాలెం, నీళ్ల కుండీల ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మధురవాడ హైవేలో మజ్జిగ పంచుతున్న దుర్గానగర్ వాసులు

మధురవాడ: మధురవాడ జాతీయ రహదారి చంద్రంపాలెం దుర్గానగర్ వద్ద కాలనీ వాసులు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఇక్కడ గత రెండు నెలలుగా దుర్గానగర్ సైట్స్ అండ్ బిల్డింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ద్వారా ఆర్‌వో వాటర్ పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

'శ్రీకృష్ణ అర్పణం' కార్యక్రమానికి కళాకారులకు ఆహ్వానం



శ్రీరాధా మదనమోహనులు

తగరపువలస: గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో గల శ్రీరాధా మదన మోహన మందిరంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ నిర్వహించు శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో పాల్గొనే కళాకారులకు నిర్వాహకులు ఆహ్వానం పలుకుతున్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 7గంటల వరకు భక్తి వేడుకగా కళ ద్వారా సాంస్కృతిక సమర్పణ చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల భక్తులు, కళాకారులు సంగీతం, నృత్యం తదితర సంప్రదాయ కళారూపాలను శ్రీకృష్ణునికి భక్తిపూర్వకంగా సమర్పించేందుకు ఒక వేదికను రూపొందించినట్లు అంబరీషదాస తెలిపారు. వివరాలకు 95425 11108లో సంప్రదించాలని కోరారు.

లయన్ జోన్ చైర్‌పర్సన్‌గా రామునాయుడు



జిల్లా గవర్నర్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న రామునాయుడు

తగరపువలస: లయన్ జోన్–3 చైర్ పర్సన్‌గా స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు లయన్ జిల్లా గవర్నర్ డి.సూర్యప్రకాష్ చేతుల మీదుగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ రీజియన్ జోన్–3లో భీమిలి సెంటీనియల్, భీమిలి గ్రేటర్, విశాఖ వాల్తేర్, విశాఖ సామరస్య క్లబ్‌లకు రామునాయుడు చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు.

విద్యార్థినికి రూ.10వేల నగదు ప్రోత్సాహకం



శిరీషకు నగదు బహుమతి అందిస్తున్న హెచ్‌ఎం రవి, టీచర్ సుజాత

మధురవాడ: పదో తరగతి పరీక్షల్లో 584 మార్కులు సాధించి, చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని సోపేటి శిరీషకు నగదు ప్రోత్సాహకం లభించింది. పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయిని అల్లు వెంకట సుజాత, శిరీషకు రూ.10వేలు నగదును ప్రోత్సాహకంగా అందజేశారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం రవి చేతులమీదుగా విద్యార్థినికి ఆ మొత్తాన్ని అందించారు. ఉపాధ్యాయిని సుజాత మాట్లాడుతూ పరీక్షల ముందు ప్రకటించిన విధంగా విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందించానని తెలిపారు. హెచ్‌ఎం రవి మాట్లాడుతూ విద్యార్థులకు సుజాత గతంలోనూ నగదు ప్రోత్సాహకాలు అందించారని, విద్యార్థులపై ఆమెకున్న వాత్సల్యానికి ఇది నిదర్శనమని కొనియాడారు.



శేరిఖండంలో శిథిలమైన రోడ్డు

> సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దుతాం. ఏ నియోజకవర్గం నుంచి రోడ్లు బాగా లేదని ఫిర్యాదు రాకూడదు. దెబ్బ తిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం.
> – గతేడాది నవంబర్‌లో ముఖ్యమంత్రి, మంత్రుల ప్రకటనలు

సంక్రాంతితో పాటు ఉగాది పండగ కూడా వెళ్లిపోయింది. కానీ నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి మాత్రం మారలేదు. ఎక్కడ చూసినా శిథిల రహదారులే దర్శనమిస్తున్నాయి. ఇక బూడిద తేలిన రహదారులకు మరమ్మతులైనా చేపట్టకుండా నీళ్లు చల్లి నెట్టుకొస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వానివి మాటల కోటలే తప్ప చేతల్లో ఉత్తదేనంటూ ప్రజలు నిట్టూరుస్తున్నారు. రోడ్లు బాగుపడేదెప్పుడా అని నిరీక్షిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

కోటలు దాటిన మాటలు
రోడ్లన్నీ గుంతలు

గ్రౌండ్ సాక్షి రిపోర్ట్

అడుగుకో గుంత

- భీమిలి మండలం తాళ్లవలస యాతపేట నుంచి కుమ్మరిపాలెం మీదుగా భీమిలి పట్టణానికి చేరుకునే మార్గంలో అడుగుకో గుంత కనిపిస్తోంది.
- జీవీఎంసీ భీమిలి జోన్ నమ్మివానిపేట రోడ్డు ఆకారం కోల్పోయింది.
- భీమిలి మండలం తాళ్లవలస పీహెచ్‌సీ రహదారి రాళ్లు తేలి, పేషెంట్ల రాకపోకలకు వీల్లేకుండా మారిపోయింది.
- జాతీయరహదారి సంగివలస నుంచి భీమిలి మండలం తాటితూరు, పద్మనాభం మండలం పాండ్రంగి మీదుగా, ఆనందపురం మండలం బోని వెళ్లే రహదారి **గోతులు, బూడి**దతో నిండిపోయాయి. దీం**తో స్థానికులు** తరచూ వాహనాలను అద్దు **కుంటున్నారు.**



గోతులు పడిన సంగివలస-పాండ్రంగి రహదారి

- మహా రాజుపేట కూడలి నుంచి తాటితూరు గ్రామానికి వెళ్లే రహదారి బీటలు వారి శిథిలమైపోయింది.
- జాతీయ రహదారి చెరకుపల్లి నుంచి భీమిలి మండలం మత్స్యకార గ్రామమైన అన్నవరం వరకు 10 కిలోమీటర్ల పరిధిలో పలుచోట్ల రహదారి ఛిద్రమైంది.

– తగరపువలస



తాళ్లవలస-కుమ్మరిపాలెం భీమిలి రహదారి ఇలా..



పూర్తిగా శిథిలమైన నమ్మివానిపేట డంపింగ్‌యార్డు రహదారి

ప్రధాన మార్గాల పరిస్థితి ఇదీ..

- భీమిలి ప్రాంతంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో రెండు రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది.
- గొల్లలపాలెం సమీపంలో కస్తూర్బా గాంధీ విద్యాలయానికి వెళ్లే మార్గం గోతులు, రాళ్లు తేలిపోయి దారుణంగా ఉంది. ఇదే మార్గంలో అనేక ఇళ్లు ఉండడంతో అందరూ ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు.
- భీమిలి నుంచి కుమ్మరిపాలెం మీదుగా తాళ్లవలసకు వెళ్లే 5 కిలోమీటర్ల మార్గం పొడవునా దెబ్బ తిని గోతులతో నిండి ఉంది. దీంతో రాకపోకలకు ప్రజలు నరకం చూస్తున్నారు. – భీమునిపట్నం



రాళ్లు తేలిపోయిన కస్తూర్బా గాంధీ విద్యాలయానికి వెళ్లే రోడ్డు

గోతులతో ఉన్న భీమిలి - తాళ్లవలస రోడ్డు

ముందుకు సాగని మాస్టర్ ప్లాన్ రోడ్డు..



రేవళ్లపాలెం వద్ద మాస్టర్‌ప్లాన్ రోడ్డు దుస్థితి



ఆర్‌టీసీ కాలనీ-మల్లయ్యపాలెం కనెక్టింగ్ రోడ్డు

- హైవేకు ఇరువైపులా ఉండి.. జీవీఎంసీ జోన్–2కి కేంద్రమైనా మధురవాడలో రోడ్లు మాత్రం అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించి ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన రేవళ్లపాలెం, నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.
- బక్కన్నపాలెం, ఆర్‌టీసీ కాలనీ, మల్లయ్యపాలెం, స్వతంత్రనగర్ తదితర ప్రాంతాలు గోతులమయంగా ఉన్నాయి.
- నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పరిస్థితి మరింత దారుణం. నగరంపాలెం, రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్లకు కనీసం మురుగు పారుదల మార్గాలు కూడా మార్కింగ్ చేయకపోవడం, కాల్వలు అసంపూర్తిగా ఉండిపోవడంతో మురుగునీరు నిల్వ ఉండిపోయి అనారోగ్య సమస్యలు, వివాదాలు తలెత్తుతున్నాయి. టీడీఆర్ సమస్యను జీవీఎంసీ క్లియర్ చేయకపోవడంతో పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. దీనికి రేవళ్లపాలెం, పోలీస్ స్టేషన్, అప్ బ్రిడ్జిల వద్ద పనులకు రు. 3కోట్లు నిధులు మంజూరు చేసినా ప్రయోజనం లేకపోయింది.
- నగరంపాలెం రోడ్డు హైవే నుంచి నగరంపాలెం వరకు పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఈ పనులు పూర్తి చేయడానికి రు. 3కోట్లు టెండర్లు పిలిచినట్టు అధికారులు చెపుతున్నారు. కాని పనులు మాత్రం పడకేశాయి.
- ఆర్‌టీసీ కాలనీ–ఉడా కాలనీ రోడ్డు, ఆర్‌టీసీ కాలనీ–మల్లయ్యపాలెం కనెక్టింగ్ రోడ్లకు అతీగతీ లేకుండా ఉంది. –మధురవాడ

ఆ మార్గంలో ఒళ్లు హూనం

- జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ నుంచి లా కాలేజి రోడ్డు, హరిత అపార్ట్‌మెంట్స్, మధురవాడ, మిథిలాపురి వుడాకాలనీకి వెళ్లే మార్గం అధ్వానస్థితికి చేరుకుంది. పూర్తి స్థాయిలో ఇది మట్టిరోడ్డు కావడంతో ఏ చిన్న వాహనం వెళ్లినా పెద్ద ఎత్తున దూ కమ్మేయడంతో ఇక్కడ నివాసితులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే ఇక అంతే. ఇటీవల అధికారులు రోడ్డు ఏర్పాటు చేస్తామని కొలతలు తీసుకున్నా కార్యరూపం దాల్చలేదు.
- జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం నుంచి ఎస్సీకాలనీ మీదుగా మారికవలసకు వెళ్లే రోడ్డు ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడటంతో ఇటుగా ప్రయాణం చేస్తే ఒళ్ళు హూనమవుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – కొమ్మాది



ఎండాడ నుంచి మధురవాడ వెళ్లే రోడ్డు దుస్థితి

ప్రయాణం.. నరకప్రాయం

- పద్మనాభం మండలంలో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఆ రోడ్లలో ప్రయాణమంటేనే అందరూ హడలిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లినా ఒళ్లునొప్పులు తప్పనిసరి. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.
- విజయనగరం–శొంఠ్యాం ఆర్‌అండ్‌బీ రోడ్డు పలుచోట్ల గోతులు పడింది. విజయనగరం, సింహాచలం వెళ్లే వాహనాలన్నీ టే తిరుగుతుంటాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.
- రెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్ నుంచి బ్యాంక్ వరకు సుమారు అర కిలోమీటరు నిడివి గల రోడ్డు, శేరిఖండంలో కృష్ణమ్మ కల్వర్టు వద్ద, శిర్లపాలెం చెరుకు కాటా వద్ద, తునివలస బంగారమ్మ ఆలయం, విజయానందపురం జంక్షన్‌కు సమీపంలో, విజయానందపురం జంక్షన్‌లో రోడ్లు గోతులు పడ్డాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.10కోట్ల నిధులు

పద్మనాభం జంక్షన్‌కు సమీపంలోని కన్నయ్య కోనేరు నుంచి రెడ్డిపల్లి సినిమా హాలు వరకు గోతులు పడి అధ్వానంగా ఉన్న మూడు కిలో మీటర్ల నిడివి గల రోడ్డును అభివృద్ధి చేయడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రూ.10.04 కోట్లు మంజూరు చేశారు. టీడీపీకి చెందిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్టర్స్ అప్పట్లో ఈ రోడ్డును టెండర్ పాడుకున్నారు. అప్పట్లో రోడ్డు పనులు చేపట్టకుండా తాత్సారం చేస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత రెండున్నర కిలోమీటర్ల నిడివి వరకు రోడ్డు వేశారు. మిగతా రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి స్టేట్‌బ్యాంకు వరకు అరకిలో మీటరు నిడివి వరకు, శేరిఖండం కష్టమ్మ కల్వర్టు వద్ద రోడ్డు వేయనేలేదు.

– పద్మనాభం



శేరిఖండంలో శిథిలమైన రోడ్డు



విజయానందపురం జంక్షన్‌కు సమీపంలో శిథిలమై, గోతులు పడిన రోడ్డు

తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం

విశాఖ లీగల్: వివిధ కారణాల వల్ల తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం అందించేందుకు విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సిద్ధంగా ఉందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఉదయం విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థ సమావేశ మందిరంలో తప్పిపోయిన బాలల దినోత్సవం నిర్వహించారు. నగర పోలీసు విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమాంతర న్యాయ సేవా సహాయకులు, ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సన్యాసినాయుడు మాట్లాడుతూ తప్పిపోయిన బాలలకు పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, లోక్ అదాలత్ ఉచితంగా సేవలందిస్తాయన్నారు. ఇందుకు సంబంధించి సమాచారాన్ని తమ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ మేజిస్ట్రేట్ 1 రామచంద్రరావు, ఏసీపీ (క్రైం) డి.లక్ష్మణరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

వర్షానికి మళ్లీ మునిగిన సబ్బవానిపేట




సబ్బవానిపేట వద్ద సర్వీస్‌రోడ్డు పైకి చేరిన మురుగునీరు

తగరపువలస: శనివారం ఉదయం కురిసిన వర్షానికి జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సబ్బవానిపేట సర్వీస్‌రోడ్డు మళ్లీ మురుగుతో నిండిపోయింది. ఇటీవల సంగివలస చెరువు ప్రక్షాళన పనులు చేపట్టడంతో సర్వీస్‌రోడ్డుపై నీరు నిలబడదని జీవీఎంసీ అధికారులు ప్రకటించి 24 గంటలు గడవకముందే ఇక్కడ లోపాలు బయటపడ్డాయి. ముఖ్యంగా చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రిని ఆనుకుని అనిట్స్ బస్టాప్ వరకు డ్రైనేజీలు పూడికతో నిండిపోయాయి. దీంతో వర్షానికి నీటికి బదులుగా ఇందులో నుంచి మురుగు బయటకు రావడం కనిపించింది. దుర్గంధం వ్యాపించిన ఈ మురుగులో నుంచే వాహనదారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించారు.

యోగా దినచర్యలో భాగం కావాలి

పీఎం పాలెం: మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని ఒకటో పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మరాభరాజు సూచించారు. యోగాంధ్ర–2025 ప్రారంభ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్ అధికారులు, సిబ్బంది యోగాసనాలు సాధన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధంగా పని చేస్తుందన్నారు. 16వ పోలీస్ బెటాలియన్ అడిషనల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న 16వ పోలీస్ బెటాలియన్ అధికారులు, సిబ్బంది

సర్పంచ్ భూమిలో ప్రత్యర్థుల దౌర్జన్యం..!

తగరపువలస: సర్వే నంబర్ 20/3 నుంచి 20/12 వరకు వరుసగా ఉన్న పది సర్వే నంబర్లలో 5 ఎకరాల 6 సెంట్ల స్థలంలో ప్రత్యర్థులు శుక్రవారం విధ్వంసం సృష్టించారని భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీ సర్పంచ్ కాద సూర్యనారాయణ ఆరోపించారు. రూ.10 లక్షల విలువైన 16 ప్లేట్లు గల రెండు సోలార్ ప్యానెళ్లు, మోటార్లు, ఎలక్ట్రికల్ డ్రైవ్, హెచ్‌డీ పైపులు, కాంక్రీట్ పోల్స్‌ను ట్రాక్టర్లతో పెకిలించి వేసి, పక్కనే సర్వే నంబర్ 21లో పడవేయడంతో శనివారం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. దీనిపై అదే గ్రామానికి చెందిన గాడు రామసూరప్పడు ఆయన వారసులు సన్యాసప్పడు, పైడి సన్ని, సురేష్, పైడప్పడు, సురేష్, భూలోక, బోని అప్పలస్వామి, మొకర నారాయణరావు తదితరులపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యనారాయణ, మజ్జిపేట ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2008లో ఈ భూమి కొనుగోలు నిమిత్తం పైన పేర్కొన్న వారికి అడ్వాన్స్ ఇచ్చానని, 2015లో తనకు అగ్రిమెంట్ చేశారని తెలిపారు. తాను సోలార్ ప్యానళ్ల సాయంతో కొబ్బరి మొక్కలు సాగు చేయగా, ఇటీవల తాను ఆస్పత్రిలో చికిత్సకు వెళ్లగా పశువులను వదిలి మొక్కల ఆనవాళ్లు లేకుండా చేశారన్నారు. గతంలో మూడు సార్లు నగర పోలీస్ కమిషనర్ సూచనలతో ఉన్నతాధికారులు విచారణ చేసి, వారిని మందలించారని తెలిపారు. ప్రస్తుతం తనకు ప్రాణహాని ఉన్నందున నిందితులపై విచారణ జరిపించాలని భీమిలి పోలీసులను ఆశ్రయించానన్నారు. తన భూమిలో దౌర్జన్యం వెనుక మండలానికి చెందిన టీడీపీ నాయకుల హస్తం ఉందని సర్పంచ్ ఆరోపించారు.



పడేసిన సోలార్ ప్యానళ్లు, హెచ్‌డీ పైప్, మోటార్లను పరిశీలిస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ, ఎంపీటీసీ

ముగ్గురు విలేకరులపై కేసు నమోదు

మధురవాడ: పోలీసుల విధి నిర్వహణలో ఆటంకం కలిగించారంటూ పీఎం పాలెం పోలీసు స్టేషన్ పరిధిలో ముగ్గురు విలేకరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో పీఎం పాలెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా మధురవాడకు చెందిన ఓ విలేకరి, నగరానికి చెందిన మరో ఇద్దరు విలేకరులు అక్కడికి వచ్చారు. వారిని పరీక్ష చేసే ప్రయత్నం చేయగా.. తాము రిపోర్టర్లమని, తమకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ఎలా చేస్తారంటూ పోలీసులపై ఎదురు తిరగడమే కాకుండా, బెదిరింపులు దిగి విధులకు ఆటంకం కలిగించారంటూ ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ ఫిర్యాదు ఇచ్చారు. దీంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక బీసీ రోడ్డుకు చెందిన ఎస్.నరసింహమూర్తి శనివా రం లక్ష 116 రూపాయల విరాళం అందజేశా రు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్‌ను ప్రోటోకాల్ విభాగం సూపరింటెండెంట్ విక్రమ్ అందజేశారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

లో ఓల్టేజి సమస్య పరిష్కారానికి వినతి

పద్మనాభం: తమ గ్రామంలో లో ఓల్టేజి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ కొయ్యపేట గ్రామస్తులు విద్యుత్ శాఖ ఏఈ జగన్మోహనరావుకు శనివారం వినతి పత్రం ఇచ్చారు. పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏఈని కలిసి తమ సమస్యను తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ అధిక లోడ్ కారణంగా గంట గంటకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. దీంతో దోమలతో నిద్రకు దూరమవుతున్నామన్నారు. మోటార్లు పని చేయక తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని తెలియజేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి, సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ముళ్ల అప్పలరాజు, రేవళ్ల అప్పలరాజుతో పాటు జెట్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు ఉన్నారు.



ఏఈ జగన్మోహనరావుకు వినతిపత్రం ఇస్తున్న కొయ్యపేట గ్రామస్తులు